సాక్షి సిద్దిపేట

సోమవారం । 17 । మార్చి । 2025



ఆదాయం ఘనం..

హుస్నాబాద్ మున్సిపాలిటీకి వారంతపు సంత ఆదాయం వెన్నుదన్నుగా నిలుస్తోంది. కానీ కనీస సౌకర్యాలు కరువయ్యాయి.


వివరాలు 8లో ▸



నాచగిరీశా..

నాచారం గుట్ట లక్ష్మీనరసింహ క్షేత్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. కోట్ల ఆదాయం ఉన్నా.. ప్రగతికి నోచుకోవడం లేదు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

నాచగిరి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎంపీ రఘునందన్‌రావుకు బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈఓ విశ్వనాథశర్మ పలువురు.. ప్రముఖులకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలను వేర్వేరుగా కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

యువత ఉపాధికి కృషి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
దుబ్బాకలో మహిళా జాబ్‌మేళా



జాబ్ మేళాకు హాజరైన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మహిళా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. ఎన్నో కంపెనీలు హైదరాబాద్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. ఫాక్స్‌కాన్ మల్టినేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కంపెనీలో సెల్‌ఫోన్ విడిభాగాలు తయారు అవతాయన్నారు. కంపెనీకి సెలక్ట్ అయినవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

దుబ్బాక మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో సమీక్షించారు. సందర్భంగా కలెక్టర్‌కు ఫోన్ చేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం పంచాయతీ రాజ్ అధికారులతో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు.

చెక్కుల అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పెద్దతండా, జనగామ గ్రామాల్లో లబ్ధిదారులకు ఆదివారం ఆయా గ్రామాల నాయకులు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పెద్దతండా గ్రామ పరిధిలోని పంజాగుట్టతండాకు చెందిన గుగులోతు లకపతికి మంజూరైన రూ.60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబునాయక్, భాస్కర్‌నాయక్, జమిలాల్‌నాయక్, నరసింహనాయక్, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల మోత.. మారని రాత

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి ‘పేరు గొప్ప.. ఊరు దిబ్బ’లా మారింది. కేసీఆర్ ప్రాతినిధ్య నియోజకవర్గంలోని ఈ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్‌గా కీర్తించారు. అంతేకాదు.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు నమూనాగా మార్చాలని గత ప్రభుత్వం భావించింది. ఈ మేరకు భారీ ప్రాజెక్టులు సైతం వచ్చాయి. కానీ ప్రధాన పనులన్నీ పెండింగ్‌లో ఉండటం ఆదర్శ పట్టణం స్ఫూర్తికి గండిపడుతోంది. ఫలితంగా సమస్యలు తీరక మున్సిపాలిటీ ప్రజలు అష్టకష్టాలుపడుతున్నారు.

– గజ్వేల్

ఆదర్శ పట్టణం.. ఇంకెంత దూరం?

- యూజీడీ నిర్మాణం లోపభూయిష్టం
- కాలనీల్లో తరుచూ మురుగు ప్రవాహం
- పారిశుద్ధ్య లోపంతో సతమతం
- రింగు రోడ్డు పూర్తి కాక.. ట్రాఫిక్ ఇక్కట్లు
- ఇళ్లు పంపిణీకి నోచుకోక తరుచూ ‘డబుల్’ రచ్చ
- కాలనీల్లో అంతర్గత రోడ్లు కచ్చ
- వానొస్తే లోతట్టు కాలనీల్లో వణుకే
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వాసుల కష్టాలు వర్ణనాతీతం



సాక్షి పరిశీలన

హైదరాబాద్ నగరానికి అతి సమీపంలో ఉన్న గజ్వేల్ మున్సిపాలిటీ స్థిరనివాసమేర్పరుచుకోవడానికి అనువైన పట్టణం. ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ కల్చర్ పెరుగుతోంది. కానీ పాలకుల నిర్లక్ష్యం పట్టణానికి శాపంగా మారుతోంది. పెండింగ్‌లో ఉన్న ప్రధాన పనులను పూర్తి చేయగలిగితే పట్టణ ప్రతిష్ట మరింతగా పెరగనుంది. పట్టణంలో రూ.156కోట్ల వ్యయంతో చేపట్టిన యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు లోపభూయిష్టంగా చేపట్టడం సమస్యగా పరిణమించింది. పనుల్లో నాణ్యతాలోపం బయటపడుతోంది. రూ.45కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో సదరు కాంట్రాక్టర్ పనులను వందశాతం పూర్తిచేయకుండానే చేతులెత్తేశారు. ఫలితంగా వర్షం కురిసిన సందర్భంలో, పైప్‌లైన్లు లీకేజీతో మురుగునీరు చాంబర్ల నుంచి బయటకు ఉబికి వస్తోంది. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

పెండింగ్‌లో బస్టాండ్ల నిర్మాణం

పట్టణంలో తూప్రాన్ రోడ్డువైపు రూ.10కోట్ల వ్యయంతో అధునాతన హంగులతో బస్టాండ్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. కానీ రింగు రోడ్డు అనుసంధానం పూర్తికాకపోవడంతో ఈ బస్టాండ్‌కు బస్సులు రాక నిరుపయోగంగా మారింది. మరో రూ.7కోట్లకుపైగా వ్యయంతో పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పక్కన నిర్మిస్తున్న మూవింగ్ బస్టాండ్, ప్రజ్ఞాపూర్‌లో రాజీవ్‌రహదారిపై నిర్మిస్తున్న మరో బస్టాండ్ పెండింగ్‌లో ఉండటం ప్రయాణికులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది.

నత్తనడకన రోడ్డు విస్తరణ

మున్సిపాలిటీలోని కోటమైసమ్మ గుడి వైపు వెళ్లే రోడ్డును 1.3 కిలోమీటర్ల మేర 70ఫీట్లుగా విస్తరించాలని నిర్ణయించారు. ఈ పనులకు రూ.12కోట్లు వెచ్చిస్తున్నారు. కొన్నేళ్లుగా పనులు సాగు...తూనే ఉన్నాయి. ప్రత్యేకించి ఎంపీడీఓ కార్యాలయం నుంచి కోటమైసమ్మ గుడి వరకు పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. బీటీ కొంత వేసి, కొంత పెండింగ్‌లో ఉంచారు. రోడ్డుకు ఇరు పక్కలా డ్రైనేజీ పనులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. రోడ్డు విస్తరణ సందర్భంలో ఎంతోమంది ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. వీరిలో కొందరికీ మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించారు. ఇంకా చాలా మందికి ఇళ్లు అందాల్సి ఉంది.

డబుల్ ఇళ్లపై తరుచూ ఆందోళనలు



మున్సిపాలిటీకి మొత్తం 1,250 ఇళ్ల మోడల్ కాలనీని మంజూరు చేశారు. ఈ కాలనీ 156 బ్లాకులుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు(మొత్తం 8 ఇళ్లు) రెండు ఫ్లోర్లుగా నిర్మాణం జరిగింది. ఒక్కో ఇల్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో కాలనీలో అన్ని రకాల వసతులను కల్పించారు. కానీ పంపిణీ వ్యవహారం ఏళ్ల తరబడి నానుతూ వస్తోంది. వివిధ రకాల ఆందోళనల తర్వాత 2023 మార్చి 21న తుది డ్రా నిర్వహించి 1100మందిని ఎంపిక చేశారు. వివిధ కారణాల వల్ల గృహప్రవేశాలు నిలిచిపోగా ఈ అంశంపై తరుచూ రచ్చ కొనసాగుతోంది.

డంపింగ్ యార్డు భద్రత గాలికి



మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో ఏటా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పడిన ఆర్అండ్ఆర్ కాలనీలతో కలుపుకొని 15వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. జనాభా 80వేల పైచిలుకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో ఇక్కడ నిత్యం ఉత్పత్తి అవుతున్న చెత్త 20మెట్రిక్ టన్నుల పైనే. చెత్తలోని వివిధ రకాల పదార్థాల వల్ల మంటలు వ్యాపించి డంపింగ్ యార్డులో తరుచూ వందలాది టన్నుల చెత్త దగ్ధమవుతోంది. ఈ పొగ పట్టణంలో వ్యాపిస్తూ ప్రజారోగ్యానికి శాపంగా మారుతోంది.

సుందరీకరణ పనులకు బ్రేక్



మూడేళ్ల క్రితం మున్సిపల్ పాలకవర్గం పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సంకల్పించింది. ఈ క్రమంలోనే పట్టణంలోని మహనీయుల విగ్రహాల జంక్షన్లను అందంగా తీర్చిదిద్ది, వాటర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేయాలని, ‘లవ్ జీపీపీ’ పేరిట స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇందుకోసం రూ.2కోట్లు నిధులు కూడా విడుదల చేసిన సంగతి తెల్సిందే. ఈపనులు అరకొరగా సాగి బ్రేక్ పడ్డాయి.

పూర్తికానీ రింగు రోడ్డు అనుసంధానం



రూ.230కోట్లతో చేపట్టిన రింగు రోడ్డు అనుసంధానం పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ధర్మారెడ్డిపల్లి–జాలిగామ గ్రామాల మధ్య 1.5కిలోమీటర్ల పొడువున పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుతం చేపడుతున్నారు. సిటిజన్స్ క్లబ్ భవనం వద్ద సుమారు 250మీటర్ల మేర పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మొత్తం 24కిలోమీటర్లకు ఇప్పటివరకు 22కిలోమీటర్ల మేర పూర్తయినా ఉపయోగం లేకుండాపోయింది. ఒకవేళ రింగు రోడ్డు నిర్మాణం పూర్తయి ఉంటే ట్రక్కులు ఇతర భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా రింగు రోడ్డు గుండా వెళ్లిపోయే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం భారీ వాహనాలన్నీ పట్టణంలోని ప్రధాన రహదారి గుండా వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

విలీన గ్రామాల యూజీడీ ప్రతిపాదనకు మంగళం



మున్సిపాలిటీలో విలీనమైన ముట్రాజ్‌పల్లి, క్యాసారంతోపాటు మధిర గ్రామాలైన సంగాపూర్, రాజిరెడ్డిపల్లి, సంగుపల్లిల్లో రెండో విడతలో యూజీడీ పనులు చేపట్టడానికి నిర్ణయించారు. సుమారు 40కిలోమీటర్లకుపైగా ఆయా గ్రామాల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అవసరమని గుర్తించారు. ఇందుకోసం రూ.49కోట్లు అవసరమని ఇప్పటికే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. కానీ ఈ ప్రతిపాదనలకు దాదాపుగా మంగళం పాడారు.

కాలనీల్లో రోడ్లు అధ్వానం



మున్సిపాలిటీ పరిధిలో 80కిలోమీటర్ల పొడవునా అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడానికి సుమారుగా రూ.120 కోట్ల నిధులు అవసరమని గత బీఆర్ఎస్ హయాంలో ప్రతిపాదించారు. కానీ రెండేళ్ల క్రితం ఇందులో కేవలం రూ. 22.87కోట్లు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. దీంతో అరకొరగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి వదిలేశారు. అంతర్గత రోడ్లు సక్రమంగా లేని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ, భారత్ నగర్, ప్రజ్ఞాపూర్‌లోని పలు వార్డులు, అదేవిధంగా విలీన గ్రామాలైన క్యాసారం, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లోని ప్రజలు నరకం చవిచూస్తున్నారు.



గజ్వేల్‌లో తూప్రాన్ రోడ్డువైపున నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ స్వరూపం

జనాభా: 55,605 (2020 లెక్కల ప్రకారం)	అందుతున్నది: 5ఎంఎల్‌డీ
ప్రస్తుత జనాభా: సుమారు 70వేలు, ఆర్అండ్ఆర్ కాలనీలతో కలుపుకొని 90వేల పైచిలుకు	రోజువారీ చెత్త ఉత్పత్తి: 12టన్నులపైనే, ఆర్అండ్ఆర్ కాలనీతో కలుపుకొని 20టన్నులు
విస్తీర్ణం: 51.9చదరపు కిలోమీటర్లు	చెత్త వాహనాలు: 5 ట్రాక్టర్లు, మరో 13ఆటోలు
రెవెన్యూ జోన్లు: 08	పబ్లిక్ టాయ్‌లెట్లు: 5
ఇళ్లు: 11,500	బస్తీ దవాఖానాలు: 1
ఆర్అండ్ఆర్ కాలనీ: 5వేలపైచిలుకు	స్వయం సహాయక బృందాలు: 620
రోజువారీ మంచినీటి అవసరాలు: 7.5ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ ఫర్ డే)	వీధి వ్యాపారులు: 2,400

తగ్గిన భగీరథ నీటి సరఫరా..



మున్సిపాలిటీకి నిత్యం 7.5 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ ఫర్ డే) నీరు అవసరం. ప్రస్తుతం 5ఎంఎల్‌డీ నీటి సరఫరా మాత్రమే జరుగుతోంది. దీని వల్ల భవిష్యత్తులో నీటి గండం తలెత్తే ప్రమాదం ఉంది. పట్టణంలో కొత్త కాలనీలకు ఇంకా మిషన్ భగీరథ కనెక్షన్లు వందల సంఖ్యలో ఇవ్వాల్సి ఉంది. దీనిపై అధికారుల కార్యాచరణ ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సిందే.

మున్సిపాలిటీలో అంతర్భాగం కాదా?



మున్సిపాలిటీలో విలీన గ్రామాలైన క్యాసారం, ముట్రాజ్‌పల్లి, రాజిరెడ్డిపల్లి, సంగుపల్లి, సంగాపూర్‌లలో యూజీడీ నిర్మించాలని ఏళ్లతరబడి కోరుతున్నాం. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మేము మున్సిపాలిటీలో అంతర్భాగం కాదా? మాపై ఎందుకు ఈ నిర్లక్ష్యం.

– ప్రవీణ్, క్యాసారం గ్రామస్తుడు

ప్రమాదాలకు చెక్ పెట్టాలి



గజ్వేల్ పట్టణంలో రింగు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో భారీ వాహనాలు పట్టణంలోకి వస్తున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రమాదాలు జరుగుతున్నాయి. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారిపై ప్రయాణమంటేనే జంకే పరిస్థితి ఏర్పడింది. రింగు రోడ్డు అనుసంధానం పూర్తి చేసి ప్రమాదాలకు చెక్ పెట్టాలి.

– బారు అరవింద్, మున్సిపాలిటీ

ప్రత్యేక కార్యాచరణ



గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రాధాన్యత క్రమంలో, దశల వారీగా పరిష్కరించడానికి కృషి చేస్తాం.

– గొల్కొండ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్

పోటెత్తిన భక్తజనం



కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదవ ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. వచ్చేవారం బ్రహ్మోత్సవాలు ముగియనుండటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. గంగిరేణు చెట్టు వద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కొండపైన ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

పర్యాటక కేంద్రంగా మహాసముద్రం

- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హుస్నాబాద్‌రూరల్: డివిజన్ కేంద్రానికి సమీపంలోని మహాసముద్రంను పర్యాటక కేంద్రంగా సుందరీకరణ చేస్తున్నామని, ఇందుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం ఉమ్మాపూర్‌లోని మహాసముద్రాన్ని పరిశీలించి, అభివృద్ధి పనులపై స్థానిక నాయకులతో చర్చించారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. పోతారం (ఎస్) జాతీయ రహదారి నుంచి బైరోని చెరువు, మహాసముద్రం వరకు రోడ్డు నిర్మాణం చేసి పర్యటక కేంద్రానికి కావల్సిన పనులను పూర్తి చేయడానికి పర్యటక శాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతానికి పొరుగు జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు తదితరులు ఉన్నారు.



మహాసముద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

దళితులంటే బీఆర్ఎస్ నేతలకు చిన్నచూపు

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఫైర్
- గజ్వేల్‌లో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం

గజ్వేల్: దళితులంటే బీఆర్ఎస్ నేతలకు చిన్నచూపు అని, ప్రజలు బుద్ధి చెప్పినా, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రావడం లేదని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై జగదీశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం గజ్వేల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులంటే బీఆర్ఎస్‌కు మొదటి నుంచి చిన్నచూపు ఉందని ఆరోపించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీలో ఆ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అగౌరవపరిచే విధంగా మాట్లాడడం తగదన్నారు. జగదీశ్వర్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్ధార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టీపీసీసీ నాయకులు సాజిద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాళేశ్వరంతో గోదావరి పరవళ్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పల్లెల్లో గోదావరి నీళ్ల పరవళ్లు తొక్కుతున్నాయని ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ఆదివారం రంగనాయక సాగర్ ప్రధాన కాల్వ నుంచి చిన్నకోడూరు బెల్లంకుంటకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదన్న కాంగ్రెస్ నేతలు చిన్నకోడూరుకు వచ్చి చూడాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్లే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో కూడా గట్టిగా కొట్లాడుతాని.. ప్రజల కష్ట సుఖాల్లో అందుబాటులో ఉంటానని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంకుంటకు నీటి విడుదల సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అక్రమ కేసులకు భయపడను

సిద్దిపేటజోన్: నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో గళం ఎత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో పలువురి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేదిలేదన్నారు. సాగునీరు లేక దుబ్బాక, చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, కేసీఆర్ హయంలో రాష్ట్రం పురగమనంలో ఉంటే కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలోఉందన్నారు. పెట్టుబడులు తగ్గి రాష్ట్ర పరిస్థితి అధ్వనంగా మారిందని విమర్శించారు.అంతకు ముందు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండి ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబాలకు బీమా చెక్కులు అందజేశారు.

క్లుప్తంగా

కేబుల్ దొంగతనానికి వెళ్లి..

జోగిపేట(అందోల్): బోరు మోటరు కేబుల్ వైర్లను దొంగిలించడానికి వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన అందోలు శివారులోని వ్యవసాయ పొలం వద్ద శనివారం రాత్రి జరిగింది. సీఐ అనీల్‌కుమార్ కథనం ప్రకారం... కొక్కొండ జగదీశ్ అనే రైతు కౌలుకు తీసుకున్న భూమిలో వరి పొలానికి నీరు పారబెట్టడానికి ఆదివారం ఉదయం పొలం వద్దకు రాగా బోరు వద్ద కరెంటు సరఫరా లేకపోవడం, కేబుల్‌ను ఎవరో ఎత్తుకెళ్లారని గుర్తించి వెళ్తుండగా అక్కడే పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసి పోలలీలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి కూలీ పనిచేసుకొని జీవించే జోగిపేట పట్టణానికి చెందిన చిత్తారి సంగమేశ్ (30)గా గుర్తించారు. బోరు వద్ద గల ప్యానెల్ బోర్డు స్విచ్ తీసేసి కేబుల్ వైరును కటింగ్ ప్లేర్‌తో కట్ చేసే క్రమంలో అతడి మెడకు ఉన్న గొలుసుకు విద్యుదాఘాతం తగిలి తల కొద్ది భాగం తెగిపోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని జోగిపేట ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాబాల్లో మద్యం సరఫరా చేస్తే చర్యలు

సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్



దాబాలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సిద్దిపేట కమాన్: దాబాల్లో మద్యం సరఫరా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని పలు దాబాల్లో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఆర్‌ఎస్, గాయత్రి, మయూరి, చాముండి, సాయిరామ్, గ్రీన్, దుర్గా దాబాలపై తనిఖీలు నిర్వహించి చట్టవిరుద్ధంగా మద్యం సేవిస్తున్న 9మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం సరఫరా చేస్తున్న దాబా నిర్వాహకులపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగపురి శివారు గండికుంటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పడాల చంద్రయ్యకు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీంతో రూ.80 వేల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం... కొమురవెల్లి గ్రామానికి చెందిన సార్ల గణేశ్, బావమరిది చిక్కుడు సత్తయ్య కలిసి ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై విశ్వనాథపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో విశ్వనాథపల్లికి టర్న్ అవుతుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రులను అంబులెన్స్‌లో సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా

ట్రాక్టర్ స్టేషన్‌కు తరలింపు



స్టేషన్‌కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులోని గుర్జకుంట వాగు నుంచి కొందరు వ్యక్తులు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఆదివారం చేర్యాల పోలీసులు అడ్డుకొని ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఆర్‌ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా నిజమేనని తెలవడంతో చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లోనే అతి పెద్ద అంగడి

- రోడ్ల పైనే వ్యాపారం
- పరదాలు కప్పుకొని కాలం వెల్లదీస్తున్న వ్యాపారులు
- కనీస సౌకర్యాలు కల్పించని మున్సిపాలిటీ అధికారులు
- గత ఏడాది వారాంతపు సంత వేలం రూ.1.20 కోట్లు
- నేడు అంగడి బహిరంగ వేలం



రోడ్ల పైనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీకి వారాంతపు సంత ఆదాయం వెన్నుదన్నుగా నిలుస్తోంది. గుండు పిన్ను మొదలుకొని ఇంటికి కావాల్సిన వస్తువులు, నిత్యావసర వస్తువులు, వ్యవసాయ పనిముట్లు ఇతరత్రా వస్తువులు అంగడిలోనే లభిస్తాయి. కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లోనే అతి పెద్ద సంత. మున్సిపాలిటీకి ఇంటి పన్నులు, వాణిజ్య పరంగా వచ్చే ఆదాయం కంటే ఎక్కువగా అంగడి ద్వారానే సమకూరుతోంది. కానీ సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ప్రతి శుక్రవారం వార సంత జరుగుతోంది. కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్ నుంచి వ్యాపారులు వస్తుంటారు. ప్రతి వారం జరిగే అంగడిలో కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది.

రోడ్ల పైనే వ్యాపారం

పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి మొదలుకొని ఎల్లమ్మ చెరువు కట్ట వరకు అంగడి కొనసాగుతోంది. వారాంతపు సంతలో అన్ని రకాల తాజా కూరగాయలు లభిస్తాయి. వివిధ మండలాల నుంచి రైతులు కూడా వచ్చి పండించిన పంటలను ఇక్కడ అమ్ముకుంటారు. పట్టణవాసులు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేస్తారు. అలాగే కూరగాయలు, నిత్యావసర వస్తువులు, ఎండు మిర్చి, బట్టలు, వ్యవసాయ పనిముట్ల అమ్మకాలు జోరుగా సాగుతాయి. అంగడికి ప్రత్యేక స్థలం లేక అన్ని వ్యాపారాలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ పరదాలు వేసుకొని ఎండకు ఎండుతూ వానకు నానుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. అంగడి నిర్వాహకులు వారి నుంచి రూ.50 నుంచి మొదలు కొని రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా.. సౌకర్యాలు కల్పించాలని వారు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. తాగడానికి నీరు, ఉండటానికి నిలువ నీడ కూడా ఉండదు. ప్రతి శుక్రవారం ఈ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరుగుతోంది.

నేడు అంగడి బహిరంగ వేలం

మున్సిపల్ కార్యాలయంలో వారాంతపు సంత నిర్వహణ కోసం సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఒక్కో గుత్తేదారుడు రూ.10 లక్షల ధరావత్తు సొమ్ముతో పాటు రూ.5 వేల దరఖాస్తు ఫీజు చెల్లించి వేలంలో పాల్గొంటారు. వేలం దక్కించుకోవడానికి హుస్నాబాద్, సిద్దిపేట, పరకాల, జమ్మికుంట, నల్లగొండ, కరీంనగర్ నుంచి గుత్తేదారులు పోటీ పడతారు. వేలంలో పాల్గొనడానికి 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన రుద్రాక్ష శ్రీనివాస్ రూ.కోటీ 20 లక్షల 26వేలకు సంత ను దక్కించుకున్నాడు. ఈ ఏడాది అంతకంటే ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు.

త్వరలో రైతు బజార్‌కు పంపిస్తాం



కొత్తగా రైతు బజార్‌ను నిర్మించాం. టాయిలెట్స్ పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే రోడ్ల పై కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులను అక్కడికి తరలిస్తాం. రోడ్ల పై అమ్మకుండా చర్యలు తీసుకుంటాం. అంగడికి వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తాం.

- మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

పశువుల వ్యాపారానికి అడ్డా ..

శుక్రవారం వచ్చిందంటే పశువుల సంతకు భలే గిరాకీ ఉంటుంది. పశువుల వ్యాపారానికి అడ్డాగా హుస్నాబాద్ నిలుస్తోంది. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు క్రయ, విక్రయాలు జరుపుకొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు వస్తుంటారు. వివిధ జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చి పశువులను కొనుగోలు చేసి వాహనాల్లో హైదరాబాద్ లాంటి పట్టణాలకు తరలిస్తారు. వార సంతలో అమ్మే పశువు ఒక్కింటికీ రూ.250 చొప్పున అమ్మిన వారి నుంచి, కొన్నవారి నుంచి రుసుం వసూలు చేస్తారు. గొర్రెలు, మేకలకు రూ.200 చొప్పున తీసుకుంటారు. ఒక్క రోజే లక్షల్లో లావాదేవీలు జరుగుతాయి. కోట్లల్లో వ్యాపారం జరుగుతున్న అంగడిలో కనీస వసతులు మాత్రం ఉండవు. అలాగే లావాదేవీలు జరుగుతున్నప్పుడు ఎలాంటి రక్షణ లేదు. అధికారులు నామమాత్రపు షెడ్లు వేసి చేతులు దులుపుకొంటున్నారు.



పశువుల సంత

చేపల కోసం చెరువులోకి దిగి..



లక్ష్మణ్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): చేపల కోసం చెరువులోకి దిగిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్ పెద్ద చెరువు వద్ద ఆదివారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్త చెరువు తండా పంచాయతీ పరిధిలోని గూగ్లోత్ తండాకు చెందిన గూగ్లోత్ లక్ష్మణ్(32) కట్టెకోత కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి వద్ద కూలీపనులు చేశాడు. ఆదివారం లక్ష్మణ్ మహమ్మద్‌నగర్ చెరువు వద్దకు వచ్చాడు. అక్కడ సురేందర్‌రెడ్డి కూలీలతో చేపలు పట్టిస్తున్నాడు. తనకు చేపలు కావాలని అతడు చెరువులోకి దిగి ఈదుకుంటూ వెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. గమనించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు విషయం చెప్పారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ అధికారులతో కలిసి చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేగుంట చెరువులో..



చేగుంట(తూప్రాన్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన అమర్‌సింగ్(31) స్థానిక ఉన్న ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం చేగుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడి బంధువులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్యం మత్తులో కిందపడి..

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మాసాయిపేట మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వెల్దుర్తి ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం... కొప్పులపల్లి గ్రామానికి చెందిన మల్లా సురేశ్(44) శనివారం కూలీ పనులకు వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వచ్చి కిందపడిపోయి నిద్రపోయాడు. ఆదివారం కుటుంబీకులు లేచి చూడగా అతడి నోట్లోంచి నురగలు వచ్చిన విషయం గమనించి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలుడిపై పోక్సో కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: బాలిక పై బాలుడు లైంగికదాడి చేసిన ఘటనలో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన రెండో తరగతి చదువుతున్న బాలిక(10) కుటుంబంతో కలిసి బాలుడి(15) ఇంట్లో అద్దెకు ఉంటుంది. అయితే అతడు అప్పుడప్పుడు బాలిక ఇంటికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఇంటికి వచ్చిన అతడు ఆమె పై లైంగికదాడి చేశాడని బాధిత తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి సంగారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించారు.

బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు

కల్హేర్(నారాయణఖేడ్): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారొద్దని సిర్గాపూర్ ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్‌వేర్ ఉందని వివరించారు. ఫేక్ లింకులతో వ్యక్తిగత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నర్సింహులు (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం ప్రకారం... తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గాలి నర్సింహులు (44) శనివా రం కిష్టయ్యపల్లికి వెళ్తున్న క్రమంలో మధ్యాహ్నం నర్సాపూర్ అటవీ ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం భార్య మంజులకు ఫోన్ ద్వారా విషయం చెప్పాడు. ఆమె బంధువుల సహాయంతో నర్సాపూర్ అటవీ ప్రాంతానికి చేరుకొని అతడిని చికిత్స కోసం హైదరాబాద్ సూరారం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కిరాణా షాపునకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డి పేటకు చెందిన అబ్దుల్ గఫార్ కుమారుడు రహీం అలియాస్ అబ్దుల్ మజీద్ (14) శనివారం రాత్రి కిరాణా షాపునకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి దశ దిన కర్మ రోజే కొడుకు మృతి



కొండపాక(గజ్వేల్): తల్లి దశ దిన కర్మ రోజున కొడుకు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ముదిరాజ్ కులానికి చెందిన కొండ సత్తవ్వ దశ దిన కర్మను కుటుంబీకులు కుల సంఘం భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పనుల్లో నిమగ్నమైన కొడుకు కొండ కృష్ణ (27) కుల సంఘం భవనానికి ఎదురుగా ఉన్న ఇంట్లో బట్టలు ఆరవేస్తున్నాడు. దీంతో విద్యుత్తు షాక్ తగిలి కిందపడటంతో తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడు తిప్పారం గ్రామ శివారులోని కోళ్లఫాంలో కూలీ పనులు చేస్తూ అందరితో కలుపుగోలుగా ఉండే వాడు. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

తల్లి మృతిని తట్టుకోలేక..

తూప్రాన్: అనారోగ్యంతో తల్లి మృతి చెందగా... తనకు తల్లిదండ్రులు లేరనే మనస్తాపంతో కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... గుండ్రెడ్డిపల్లికి చెందిన చాకలి చింతలి పోచమ్మ ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి చావుకు తమ్ముడు రాజు కారణమని అక్క పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి రాజు మనస్తాపానికి గురై తనకు తల్లిదండ్రులు లేరని నిత్యం మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలో ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో గద్దె దిగాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరంలో గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమంలో బీజేపీ మానవ హక్కుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కప్పర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగాలేదని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటంపై ప్రజలు ఆలోచించాలన్నారు. కార్యక్రమం బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రావు

హామీలను విస్మరించడం సరికాదు

తపస్ రాష్ట్ర నాయకుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల ముందు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీలిచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలని తపస్ రాష్ట్ర నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో తపస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగ నర్సిరెడ్డిలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు త్రిశంకు స్వర్గాన్ని చూపించిన సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనే వంకతో మొండిచేయి చూపడం దారుణమన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై మాట్లాడిన తీరు మంచిగా లేదన్నారు. హామీలు అమలు చేయకుంటే తపస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, లింగమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, దేవదాస్, జైపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

రామాయంపేట (మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామంలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని వెల్ముల నందిని (22) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లిదండ్రులు పక్క గ్రామంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఇంట్లో ఉన్న ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. అనంతరం ఇంటి తలుపులు గడియ పెట్టుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే సదరు యువకుడు, మరికొందరితో వచ్చి చూడగా, అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న మృతురాలి తల్లిదండ్రులు ఇంటికి వచ్చి విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

యువకుడు దారుణ హత్య



సంగారెడ్డి క్రైమ్: ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం ప్రకారం... మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మన్నే వినోద్ (21), 2024లో బతుకు దెరువు కోసం మెదక్ నుంచి సంగారెడ్డికి వలస వచ్చాడు. స్థానికంగా ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట భిక్షాటన చేస్తూ జీవించేవాడు. తనకు పరిచయం ఉన్న సదాశివపేట మండలం కులుకూరు గ్రామానికి చెందిన గడ్డం మరియమ్మకు వెనక ముందు ఎవరూ లేకపోవడంతో, ఆమెతో కలిసి కొన్ని నెలలుగా పట్టణంలోని శివాజీనగర్‌లో కలిసి ఉంటున్నాడు. శనివారం రాత్రి 9 .15 నిమిషాలకు మద్యం మత్తులో ఇంటికి వచ్చిన అతడు మరియమ్మను డబ్బులివ్వమని అడగడంతో, తీవ్ర అసహనానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న కర్రతో కొట్టి చంపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీమా కుటుంబానికి ధీమా

ఆపదలో అండగా కేంద్ర ప్రభుత్వ తపాలా బీమా

- అవగాహన లేక తీసుకోలేక పోతున్న ప్రజలు
- జిల్లాలో 10, 200 మంది పాలసీదారులు
- ప్రజలకు అందుబాటులో తక్కువ ప్రీమియంలు



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఇన్సూరెన్స్ అధికారులు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: ప్రస్తుత సమాజంలో ప్రతి ఇంట్లో కనీసం ఒక ద్విచక్ర వాహనం, కార్లు ఉన్నాయి. ఏ చిన్న అవసరం పడినా బైక్ పైనే పరుగులు పెడుతున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో ప్రాణాలు పోవడమే అత్యధికంగా జరుగుతోంది. అప్పుడప్పుడు మాత్రం అంగవైకల్యంతో బయట పడుతున్నారు. అత్యధికంగా మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే విద్యుత్ మోటర్ల వద్ద పొలానికి నీళ్లు పారిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై ఎంతో మంది రైతులు మృత్యువాత పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. జిల్లాలో 2023లో 562 రోడ్డు ప్రమాద ఘటనల్లో 223 మంది మృత్యువాత పడ్డారు. అలాగే 2024లో 568 రోడ్డు ప్రమాదాల్లో 302 మంది చనిపోగా, మరో 459 మంది గాయాల పాలయ్యారు. అకాల మరణాలతో వారిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. ఆదుకునే వారు లేక, ఆర్థికంగా ఎదగలేక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు అతి తక్కువ ప్రీమియంతో పెద్ద మొత్తంలో బీమా అందిస్తోంది.

ఏడు ప్రైవేట్ కంపెనీలతో...

కేంద్ర ప్రభుత్వం పలు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలతో కలిసి అతి తక్కువ మొత్తానికే తపాలా ప్రమాద బీమా అందిస్తోంది. ఆపద సమయంలో అభాగ్యులకు అండగా ఉండేందుకు తీసుకొచ్చిన ఈ పాలసీతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇందులో టాటా ఏఐజీ, బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, స్టార్ హెల్త్, నివోభూపా, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, రాయల్ సుందరం, ఆదిత్య బిర్లా కంపెనీలు పనిచేస్తున్నాయి.

రూ.549లతో రూ.10 లక్షలు, రూ.749తో రూ.15 లక్షలు

పాలసీదారులు కేవలం రూ.549 లేదా 555లు చెల్లిస్తే రూ.10లక్షల బీమా లభిస్తుంది. అలాగే రూ.749 లేదా 755లతో రూ.15లక్షల బీమా అందిస్తున్నారు. ఒక్కొక్కరు రెండు, మూడు పాలసీలు కూడా చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రమాదవశాత్తు పాలసీదారు మరణించడం లేదా శాశ్వత అంగవైకల్యం, పక్షవాతం బారిన పడినప్పుడు అతడి కుటుంబానికి బీమా డబ్బులు అందజేస్తారు. అయితే పాలసీదారులు రూ.18 నుంచి 66 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి.

3 లేదా 4నెలల్లో క్లయిమ్..

పాలసీదారు ప్రమాదవశాత్తు మరణిస్తే మూడు లేదా నాలుగు నెలల్లోనే క్లయిమ్ డబ్బులు ఖాతాలో జమ అవుతాయి. దీంతో ఆ కుటుంబానికి ఆర్థికంగా కొండంత అండ లభిస్తోంది. అలాగే బీమా చేసిన వ్యక్తికి చదువుకునే పిల్లలిద్దరు ఉంటే వారి చదువు ఖర్చులు పదిశాతం లేదా రూ.ఒక లక్ష ఇలా ఏది తక్కువైతే అది చెల్లిస్తారు.

విదేశాల్లో ఉన్నా...

పాలసీదారుడు విదేశాల్లో మరణిస్తే స్వదేశం తేవడానికి రూ.5వేలు, అంత్యక్రియలకు రూ.5వేలు అందజేస్తారు. చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు దూర ప్రాంతాల్లో ఉంటే అంత్యక్రియలకు రూ.25వేలు ఇస్తారు. ప్రమాదంలో పాలసీదారుడు తీవ్రంగా గాయపడితే చికిత్స కోసం రూ.లక్ష, కోమాలోకి వెళితే రూ.లక్ష, ప్రమాదం జరిగిన వ్యక్తి రెండు రోజులకు మించి ఆస్పత్రిలో ఉంటే పదిరోజుల వరకు రోజుకు రూ.1000ల చొప్పున చెల్లిస్తారు.

జిల్లాలో రూ.1.40 కోట్లు

జిల్లాలో మొత్తం 10,200 మంది పాలసీదారులు ఉన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన పాలసీదారుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.1.40కోట్ల బీమా డబ్బులు అందజేశాం. సబ్ పోస్ట్ మాస్టర్లు, పోస్ట్ మాస్టర్ల ద్వారా తపాలా బీమాపై ప్రజలకు సమాచారం అందిస్తున్నాం. జిల్లాలోని ప్రజలందరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలి. ఆపద సమయంలో కుటుంబాలను ఆదుకుంటాయి.

-శ్రీనివాస్, పోస్టల్ ఇన్సూరెన్స్ అధికారి, మెదక్